ఆంధ్రజ్యోతి 22 APR 2018

## ప్రశాంతంగా నవోదయ పరీక్ష



పరీక్షా కేంద్రానికి చేరుకున్న విద్యార్థులు

**యానాం, ఏప్రిల్ 21:** యానాం శివారు మెట్టకూరులో గల జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసినట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బి.పి. రాజు తెలిపారు. నియోజకవర్గంలోని రెండు సెంటర్లలో పరీక్ష జరిగింది. స్థానిక మహాత్మాగాంధీ బాలుర ఉన్నతపాఠశాల,రాజీవ్‌గాంధీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో పరీక్ష నిర్వహించారు. మొత్తం 500విద్యార్థులకు 447 మంది పరీక్ష రాశారు. పరీక్షా కేంద్రాలను నవోదయ విద్యాలయ సంస్థ చైర్మన్, యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ప్రాంతీయ విద్యాశాఖాధికారి కాలే సాయినాథ్‌లు పరిశీలించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## కనకదుర్గమ్మ ఆలయంలో మంత్రి మల్లాడి ప్రత్యేక పూజలు



కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మల్లాడి

**యానాం, ఏప్రిల్ 21:** పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. యానాం నుంచి పుదుచ్చేరి వెళ్తూ మార్గమధ్యలో విజయవాడ చేరుకుని కనకదుర్గమ్మఅమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మంత్రి మల్లాడికి స్వాగతం పలికి వండితాశీర్వచనం చేశారు. అనంతరం గన్నవరం విమానాశ్రయం నుంచి పుదుచ్చేరి బయల్దేరి వెళ్లారు. మల్లాడి వెంట విజయవాడకు చెందిన ప్రముఖ శిల్పి ప్రసాద్ ఉన్నారు.

## అర్హులందరికీ ఉచిత గ్యాస్ కనెక్షన్లు'

**యానాం, ఏప్రిల్ 21:** నియోజకవర్గంలో అర్హులందరికీ ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు తెలిపారు. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన కింద ఇప్పటి వరకూ వంట గ్యాస్ కనెక్షన్ తీసుకోని ఎరుపు రంగు రేషన్‌కార్డుదారులు (బీపీఎల్/ఏఏవై)కు ఈ పథకంలో ఉచితంగా గ్యాస్ కనెక్షన్ ఇస్తామన్నారు. భారత ప్రభుత్వం 2011 జనాభా లెక్కల ప్రకారం ఇచ్చిన ఎస్ఈసీసీ డేటాలో లబ్ధిదారుల పేరు తప్పనిసరిగా ఉండాలన్నారు. దీనికి సంబంధించి డేటా యానాం కోపరేటివ్ స్టోర్స్‌లోని భారత్ గ్యాస్ ఆఫీస్ వద్ద అందుబాటులో ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఎంబీసీ కులాలకు చెందిన వారైతే డేటాలో పేరు లేకపోయినప్పటికీ కుల ధృవీకరణ పత్రం ఉంటే ఈ పథకానికి అర్హులవుతారన్నారు. ఈ పథకం మహిళల పేరు మీద ఇస్తారన్నారు.

## ఆలయ పునర్నిర్మాణానికి కమిటీ ఏర్పాటు

**యానాం, ఏప్రిల్ 21:** నియోజకవర్గంలో రెడ్డి రాజుల కాలంనాటి అతి పురాతన ఆలయమైన శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి కమిటీని ఏర్పాటు చేసినట్లు మంత్రి మల్లాడి కృష్ణారావు తెలిపారు. ఆలయ పునర్నిర్మాణం నిమిత్తం 50 మంది స్థానిక ప్రముఖులతో ఈ కమిటీని ఏర్పాటు చేయనున్నామన్నారు.

## నిధుల దుర్వినియోగంపై విచారణకు డిమాండ్

**యానాం, ఏప్రిల్ 21:** యానాం ప్రాంతానికి చెందిన షెడ్యూల్డ్ కులాల వారి అభ్యున్నతికి వెచ్చించాల్సిన రూ.2.95 కోట్ల నిధుల్ని ఎస్సీ సంక్షేమానికి సంబంధం లేని ఆరు పనులకు వెచ్చించిన వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు చేయించాలని, అధికార్లపై చర్యలు తీసుకోవాలని యానాం సివిల్‌రైట్స్ సొసైటీ అధ్యక్షుడు పొనుగుమట్ల విష్ణుమూర్తి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడీకి ఫిర్యాదు చేశారు. దరియాలతిప్ప పరిధిలోని సీతారాంనగర్ వద్ద మురుగుకాల్వల అభివృద్ధికి రూ.1.50 కోట్లు, మెట్టకూరులోని మూడు తూముల వద్ద నుంచి స్మశానవాటిక వరకు రూ.1.40 కోట్లు నిధులను ఖర్చు చేశారని, ఎస్సీలకు వెచ్చించాల్సిన నిధుల్ని ఇతరుల కోసం ఖర్చు చేయడంపై విచారణ చేయాలన్నారు.

## 24 నుంచి ఐసీటీ శిక్షణా తరగతులు

**యానాం, ఏప్రిల్ 21:** యానాం ప్రాంతీయ విద్యాశాఖ పరిధిలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ)పై ఈ నెల 24 నుంచి శిక్షణా తరగతులు నిర్వహిస్తారని విద్యాశాఖాధికారి కాలే సాయినాథ్ తెలిపారు.

ఈనాడు 22 APR 2018

# ప్రశాంతంగా నవోదయ పరీక్ష



యానాంలోని పరీక్ష కేంద్రం వద్ద తమకు కేటాయించిన గది వివరాలు చూసుకుంటున్న విద్యార్థులు

**యానాం, న్యూస్‌టుడే:** జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి యానాంలోని రెండు కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష జరిగింది. స్థానిక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఆంగ్లమాధ్యమ పాఠశాల, మహాత్మాగాంధీ బాలుర హైస్కూల్‌లోని కేంద్రాల్లో 447 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాశారు. శారదా విద్యానికేతన్‌కు చెందిన ఓ బాలుడు మహాత్మాగాంధీ బాలుర హైస్కూల్‌లోని కేంద్రం వద్ద హాల్‌టిక్కెట్టు పోగొట్టుకోవడంతో విద్యాశాఖాధికారి కాలే సాయినాథ్ వద్దకు రాగా తక్షణమే కంప్యూటర్‌లో హాల్‌టిక్కెట్‌ను తీయించి పరీక్షకు అనుమతించారు. రాజీవ్‌గాంధీ ఆంగ్లమాధ్యమ పాఠశాలలో 36 మంది, మహాత్మాగాంధీ బాలుర హైస్కూల్‌లో 17 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాలేదని విద్యాశాఖాధికారి, పరిశీలకుడు కాలే సాయినాథ్, నవోదయ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ టి.పి. రాజు తెలిపారు. ఈ కేంద్రాలను ప్రాంతీయ పరిపాలనాధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు పరిశీలించారు.

# వేసవి సెలవుల్లో కంప్యూటర్ శిక్షణ

**యానాం, న్యూస్‌టుడే:** కంప్యూటర్ విద్యపై విద్యార్థులకు ప్రాథమిక అవగాహన కల్పించాలనే పుదుచ్చేరి విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈనెల 24 నుంచి మే 18 వరకు యానాంలోని అన్ని ప్రభుత్వ హైస్కూళ్లలోని ఐసీటీ ల్యాబ్‌లలో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రాంతీయ విద్యాశాఖాధికారి కాలే సాయినాథ్ తెలిపారు. శనివారం తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ నాల్గో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు తమ చేరువలోని హైస్కూళ్లలో ఉదయం 9 గంటల నుంచి కంప్యూటర్ శిక్షణ పొందవచ్చన్నారు. పుదుచ్చేరికి చెందిన ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ ఎడ్యుకేషన్, టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థ శిక్షణలో ఏం నేర్పాలన్నది నిర్ణయించి తగు సహకారం అందిస్తుందన్నారు. ఈ సమావేశంలో దరియాలతిప్ప హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు నక్కా వాసుదేవరావు, పాము సత్యనారాయణ పాల్గొన్నారు.



రిలయన్స్ పరిశ్రమ వెలుపల విద్యార్థులు, ఉపాధ్యాయులు

# రిలయన్స్ పరిశ్రమను సందర్శించిన విద్యార్థులు

**గిలియాంపేట (యానాం):** తాళ్లరేవు మండలం గాడిమొగలోని రిలయన్స్ చమురు శుద్ధి పరిశ్రమను పెరుంతలైవర్ కామరాజర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం సందర్శించారు. విజ్ఞానయాత్రలో భాగంగా తొమ్మిదవ తరగతి విద్యార్థులు పర్యటనలో పాల్గొన్నట్లు ప్రధానోపాధ్యాయుడు డి.త్రిమూర్తులు తెలిపారు. కృష్ణా, గోదావరి బేసిన్ నుంచి సహజ వాయువు, ఇతర ఉత్పత్తులు పైప్‌లైన్ ద్వారా పరిశ్రమలోకి ఎలా వస్తాయి.. వాటిని ఏవిధంగా శుద్ధి చేసి ఇతర ప్రాంతాలకు ఎలా పంపుతారో తెలుసుకున్నారన్నారు. భద్రతాప్రమాణాలు, నిర్వహణ తదితర అంశాల్ని సీఎస్ఆర్ విభాగానికి చెందిన రమణరావు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెనుల జయరామయ్య, దాట్ల శశికాంతవర్మ, టిల్లపూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు కొప్పనాతి భాస్కర్ పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించండి: బేడీ

**యానాం, న్యూస్‌టుడే:** పుదుచ్చేరిలోని వివిధ ప్రైవేటు వైద్య కళాశాలలు, డీమ్డ్ యూనివర్సిటీలు సెంటాక్ ద్వారా నిర్వహించిన పోస్టుగ్రాడ్యుయేట్ మెడిసిన్ సీట్ల భర్తీ విషయంలో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు పాటించాలని లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడీ స్పష్టం చేశారు. వైద్య కళాశాలలు సీట్లు ఇవ్వడానికి తిరస్కరిస్తున్నాయంటూ నలుగురు అభ్యర్థులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో బేడీ ఈ అంశం గురించి న్యాయ నిపుణులతో చర్చించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సెంటాక్ కమిటీ వద్ద గడువులోగా రుసుము చెల్లించిన అభ్యర్థులకు సీటు ఇవ్వాల్సిందేనని సెంటాక్ కన్వీనర్ పీటీ రుద్రగౌడ తెలిపారు.

# రేపటి నుంచి భద్రతా వారోత్సవాలు

**యానాం, న్యూస్‌టుడే:** రోడ్డు ప్రమాదాల నివారణపై అన్నివర్గాలకు అవగాహన కల్పించేందుకు సోమవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ జె.రవిచంద్రన్ తెలిపారు. ఇందులో భాగంగా ట్రాన్స్‌పోర్టు, ప్రైవేటు స్కూల్ బస్సు డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు, జాతీయ సేవాపథకం విద్యార్థులతో ర్యాలీ, కళాశాలల విద్యార్థులకు లెర్నింగ్ లైసెన్సుల జారీ, డ్రైవింగ్‌పై అవగాహన, లారీ, ఆటో, ఇతర రవాణా వాహనాల డ్రైవర్లకు ఉచిత వైద్య పరీక్షలు, గోడ పత్రికల ఆవిష్కరణ ఉంటాయన్నారు.

# గ్యాస్ కనెక్షన్‌కు దరఖాస్తులు

**యానాం:** ప్రధానమంత్రి ఉజ్వల యోజన ద్వారా యానాంలో నివసిస్తున్న ఎరుపు రంగు రేషన్ కార్డుదారులు (బీపీఎల్, అంత్యోదయ) ఉచిత గ్యాస్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు ప్రకటనలో తెలిపారు. కేంద్రప్రభుత్వం 2011లో నిర్వహించిన జనాభా లెక్కల ప్రకారం ఎస్ఈసీసీ డేటాలో దరఖాస్తుదారుడి పేరు తప్పనిసరిగా ఉండాలన్నారు.

నవ్యాంధ్ర 22 APR 2018

## నవోదయపరీక్షకు 447 మంది హాజరు

యానాం: యానాం లోని మెట్టకూరు నవోదయవిద్యాలయలో 6వతరగతిలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షకు 447మంది అభ్యర్థులు హాజరైనట్లు విద్యాశాఖాధికారి శాలే సాయినాథ్ శనివారం విలేకరులకు తెలిపారు. పట్టణ పరిధిలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా సెంటర్లు మహాత్మాగాంధీ ప్రభుత్వ ఉన్నతపాఠశాల, రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లీషు మీడియం పాఠశాల లను పరిపాలనాధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వ రరావు పరిశీలించారు. ఒక్కో సెంటర్‌కు 250 మంది చొప్పున 500 మంది అభ్యర్థు లను కేటాయించినట్లు అయితే 53మంది పరీక్షకు గైర్హాజరు కాగా 447మంది పరీక్ష రాశారని తెలిపారు.

## ఉచిత బియ్యం పంపిణీకి చర్యలు

యానాం: పుదుచ్చేరివ్యాప్తంగా నాలుగు రీజియన్‌లలోని ప్రాంతాలలోని అన్ని రేషన్ కార్డుదారులకు రూ.20కేజీల చొప్పున ఉచితబియ్యం పంపిణీకి వారంలోగా చర్య లు తీసుకోనున్నట్లు సీఎం నారాయణసామి శనివారం విలేకరులకు తెలిపారు. ఉజ్వల యోజన ఉచిత ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్ల పంపిణీ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉచితబియ్యాన్ని అన్ని రేషన్ కార్డులకు ఇవ్వడంతో పాటు వృద్ధాప్య పింఛన్లు పంపిణీ, సెంటాక్ విద్యా సహాయంను సైతం అందజేయనున్నట్లు తెలిపారు.

## కార్పొరేట్ పాఠశాలలో ప్రభుత్వ ఫీజు విధానం

**ఫ్లెక్సీలో వివరాలు ప్రకటించిన శ్రీచైతన్య**



ఫీజుల ఫ్లెక్సీని బహిరంగ ప్రదర్శనగా వుంచిన దృశ్యం

యానాం: కార్పొరేట్ పాఠశాలల్లో ప్రస్తుతం అధిక ఫీజులతో పాటు అంతటా గోప్యత ప్రదర్శిస్తూ ప్రభుత్వ నిబంధనలకు విరు ద్ధంగా ఆయా యాజమాన్యాలు వ్యవహరిస్తు న్నాయి. అయితే దీనికి విరుద్ధంగా యానాంలోని శ్రీచైతన్య పాఠశాల యాజమా న్యం పుదుచ్చేరి ప్రభుత్వ ఫీజు కమిటీ నిర్ణ యించిన ఫీజులను అందరికి తెలియజేసేలా పారదర్శకత పాటించాలనే ఉద్దేశంతో శనివారం పాఠశాల ఎదురుగా ఫీజుల వివ రాలతో కూడిన ప్రభుత్వ ఆర్డర్‌నే ఫ్లెక్సీ బోర్డుగా తయారుచేసి బహిరంగ ప్రదర్శనకు వుంచారు. 2018-19 విద్యా సంవత్సరానికి ఫీజుల వివరాలను బహిరంగ ప్రదర్శనకు ఉంచినట్లు ప్రిన్సిపాల్ ఎస్.మోహన్‌రెడ్డి విలేకరులకు తెలిపారు. అన్ని ఫీజులను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మార్పుచేసినట్లు గతంలో పోలిస్తే తక్కువగా వున్నప్పటికీ యాజమాన్యాన్ని ఒప్పించినట్లు అవిధంగా గతంలో పదో తరగతికి రూ.36వే లు వుంటే ప్రస్తుతం రూ.28 వేలువుందని అవిధంగా ఎల్‌కెజి నుంచి అన్ని తరగతుల ఫీజులు ప్రభుత్వ ఫీజు కమిటీ నిర్ణయించిన విధంగానే వున్నాయని అన్నారు.

## నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు

**ప్రైవేట్ మెడికల్ కళాశాలలకు ఎల్జీ హెచ్చరిక**

యానాం: పీజీ మెడికల్, డెంటల్ కోర్సుల్లో ప్రవేశాల్లో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకం గా అడ్మిషన్లు జరిపే ప్రైవేట్, డీమ్డ్‌యూనివ ర్శిటీలపై చట్టపరమైన, పరిపాలనాపరమైన చర్యలు తీసుకుంటామని ఎల్జీ కిరణ్‌బేడీ హెచ్చరించారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సెంట్రలైజ్డ్ అడ్మిషన్ కమిటీ (సెంటాక్) నిబంధనలు ప్రకారం అడ్మిషన్లు వుండాలని ఆమె అన్నారు. సెంటాక్ కోఆర్డినే టర్ రుద్రగౌడ మాట్లాడుతూ ప్రస్తుత 2018-19 విద్యాసంవత్సరంలో 17 పీజీ మెడికల్‌సీట్లు 12 ప్రభుత్వ కోటా, 5 మేనేజ్ మెంట్ కోటా సీట్లు వుండగా, 8 డెంటల్ పీజీ సీట్లును మొదటి రౌండ్‌లో కౌన్సిలింగ్ పూర్తిచే సినట్లు తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఫీజు కట్టినవెంటనే ఆయా కళాశాల లు అభ్యర్థులను జాయిన్ చేసుకోవాలని అన్నారు. ఈ నేపథ్యంలో 147 సీట్లు సెంటాక్ ద్వారా కేటాయించగా 25మంది విద్యార్థులు ఆఖరు రోజు శనివారం ఫీజు చెల్లించారు. రెండవ రౌండ్ కౌన్సిలింగ్ త్వర లో ప్రారంభ మవుతుంది.

## యానాంలో పోలీస్ పెట్రోలింగ్

యానాం: ఎస్పీ నితిన్ గోహెల్ ఆదేశాల మేరకు శనివారం రాత్రి పోలీసులు పట్టణమంతా పెట్రోలింగ్ నిర్వహించి విస్తృత తనిఖీలు నిర్వహించారు. సీఐ గిడ్డ సత్యనారాయణ, ఎస్సైలు కట్టా సుబ్బరాజు, శివకుమార్, బడుగు కనకారావు, కోస్టల్ పోలీస్ విభాగాలతో పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుకు అడ్డంగా ట్రాఫిక్‌కు అంతరాయంగా వున్న వాహనాలను తొలగించారు. అదేవిధంగా షాపులు ఎదురుగా ఇష్టానుసారం వాహనాలు పార్క్ చేయకుండా ఒక వైపే వాహనాలు నిలపాలని షాపుల యాజమాన్యాలకు హెచ్చరికలు జారీచేశారు. ఈ కార్యక్ర మంలో బీట్ ఆఫీసర్ కదలి మధు, గణేష్ పాల్గొన్నారు.

## మున్సిపల్ షాపులను వేలం వేయాలి

యానాం: మున్సిపాలిటీ అజమాయిషీలోని షాపులను అద్దెకు ఇవ్వడానికి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వేలం పాట నిర్వహించాలని స్థానిక బీజేపీ నాయకులు పెనల వీరవెంకటే ష్ డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ అజమాయిషీలో 127 షాపులు ఉండగా ప్రస్తుతం వాటి ద్వారా ఆదాయం రూ.80వేలు మించడం లేద న్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం షాపులకు వేలం నిర్వ హించమని ఆదేశించిందని దానిని అమలు చేయాలని వారు కోరారు. తద్వారా లక్షలాది రూపాయిల మేర మున్సిపా లిటీకి ఆదాయం సమకూరుతుందని అన్నారు.

**షాపుల అద్దెల వివరాలు పుదుచ్చేరి పంపాం**

మున్సిపాలిటీ షాపులకు సంబంధించిన అద్దెల వివరాలు షాపుల వైశాల్యం బట్టి పుదుచ్చేరికి పంపించినట్లు కమిషనర్ గుబ్బ గౌరీసరోజ శనివారం తెలిపారు. అద్దెల పెంపుతో ఆదాయం పెరుగుతుందని సుమారు రూ.2లక్షల వరకు ఆదాయం వస్తుందని భావిస్తున్నట్లు తెలిపారు.

జనస్పందన
22 APR 2018

# పుదుచ్చేరి ప్రభుత్వంచే 29వ భద్రతా వారోత్సవాలు

యానాం, ఏప్రిల్ 21(జనస్పందన విలేకరి)స్థానికంగా పుదుచ్చేరి ప్రభుత్వం రవాణా శాఖ యానాం రహదారి భద్రత వారోత్సవాలు మా దేశంలో ప్రతి సంవత్సరం ప్రమాదాలద్వారా ఏర్పడుతున్న ప్రాణ నష్టం, అంగ వైకల్యం, వాహన నష్టం పెరుగుచున్నవి. వాటిని నియంత్రించే దిశగాఅన్ని వర్గాల వారికి రహదారి భద్రతకు సంబంధించి అవగాహన ఏర్పాటు చేసే విధంగా ఈ భద్రతోత్సవాలు జరుగుతున్నట్లు 23.4.2018 నుండి 30.04.2018 వరకు ఈ ఉత్సవాలు జరుపనున్నట్లు యానాం ఆర్‌టిఓ జె.రవిచంద్రన్ పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని రంగాల వారికి రోడ్ & సేఫ్టీ ప్రీకాజన్స్ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. యానాంలో మహిళలకు 18 ఏళ్ళ వయస్సు కలిగిన ఎక్కువ శాతం డ్రైవింగ్ మరియు రోడ్ & సేఫ్టీ లైసెన్స్ ప్రాముఖ్యతను వివరించాల్సిందిగా పలువురు కోరుకుంటున్నారు. యానాంలో అధిక శాతం మహిళలు వాహనాలను నడుపుచున్నారు. కాబట్టి రవాణా శాఖ అధికారులు వీరిని గుర్తించి వారికి లైసెన్స్ సంబంధిత భద్రతఅవగాహన కల్పించాల్సిందిగాపలువురు కోరుతున్నారు.

# ట్రాఫిక్‌ను నియంత్రించాలి!

యానాం, ఏప్రిల్ 21 (జనస్పందన విలేకరి) స్థానిక ప్రధాన కూడలిలో ట్రాఫిక్ అంతరాయాలు రోజురోజుకు పెరుగుతుంది. యానాం ప్రధాన కూడలిలో ట్రాఫిక్ నియమ నిబంధనలు, ఆంక్షలు ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రధాన కూడలిలో సైతం ఈ నియమ నిబంధనలు వాహనదారులు ఉల్లంఘిస్తున్నారు. పోలీస్ యంత్రాంగం వీటిని కట్టుదిట్టం చేసి భద్రత చర్యలు తీసుకోవాలి. రోడ్లపై పశువులు వాటంతట అవే దాడులు చేసుకుంటూ వాహనదారులను భయభ్రాంతులను చేస్తున్నాయి. అప్పటికైనా వాహనదారులకు నియమ నిబంధనలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండే విధంగా తగు చర్యలు తీసుకుంటే బాగుంటుందని పలువురు కోరుకుంటున్నారు. 18 ఏళ్ళ వయస్సు దాటిన యువతీ, యువకులు లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్నారు. వారికి లైసెన్స్ యొక్క ప్రమాణాలు మరియు వాహనం నడిపేటప్పుడు నియమ నిబంధనలు తెలియడం లేదని కాబట్టి పోలీస్ యంత్రాంగం వీటిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# నవోదయ పరీక్షలను పరిశీలించిన ఆర్‌వొ దవులూరి

యానాం ఏప్రిల్ 21(జనస్పందన విలేకరి) స్థానిక ఎంజిజి బాయ్స్ హైస్కూల్ నందు జవహార్ లాల్ నవోదయ 6వ తరగతి ఎంపికకు వ్రాత పరీక్షలు నిర్వహించిన ఆయా సెంటర్లలలో జరిగాయి. ఈ కార్యక్రమంలో యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వర రావు ఈ పరీక్షలను పరిశీలించారు. తదనంతరం విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉన్నాయని ఆరా తీసారు. విద్యార్థులకు మంచినీళ్ళ సరఫరా చేయాలని సిబ్బందిని కోరారు.

ప్రజాశక్తి
22 APR 2018

## ప్రభుత్వ నిర్ణయం మేరకే శ్రీచైతన్య స్కూలు ఫీజులు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వం ప్రయివేటు స్కూలు ఫీజులను నిర్ణయించిన ప్రకారమే శ్రీచైతన్య స్కూల్లో ఫీజులు నిర్ణయించామని ప్రిన్సిపల్ ఎస్.మోహన్‌రెడ్డి తెలిపారు. ఫీజుల పట్టిక బోర్డును ప్రదర్శనగా ఉంచామన్నారు. పాఠశాలలో ఉన్న సదుపాయాల ప్రకారం కమిటీ నిర్ణయించిన విధంగా ఈ ఫీజులు నిర్ణయించినట్లు తెలిపారు.

## సెలవుల్లో విద్యార్థులకు ఐటిసి క్లాసులు

ప్రజాశక్తి - యానాం

యానాం మహాత్మాగాంధీ ప్రభుత్వ బాయ్స్ హైస్కూల్లో ప్రైమరీ, ఉన్నత పాఠశాల విద్యార్థులకు వేసవి సెలవుల్లో కంప్యూటర్ విద్య నేర్పుకునేందుకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ క్లాసులు జరుగుతాయని ప్రాంతీయ విద్యాశాఖాధికారి కాళే సాయినాథ్ తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు తప్పక వినియోగపర్చుకోవాలని, క్లాసులు ఈనెల 24 నుంచి మే 18 వరకు జరుగుతాయని తెలిపారు.

## యానాం వీధుల్లో సిఐ పెట్రోలింగ్

ప్రజాశక్తి - యానాం

యానాంలో పరిసర ప్రాంతాల్లో శనివారం సిఐ గిడ్ల సత్యనారాయణ పెట్రోలింగ్ నిర్వహించారు. ఎస్ఐలు, కానిస్టేబుళ్ళు, హోంగార్డులు, ట్రాఫిక్ సిబ్బందితో నడుచుకుంటూ వీధుల్లో ఉన్న ఇళ్ళ వద్ద, షాపుల వద్ద సమస్యలు తెలుసుకుంటూ వారికి సహకారం అవసరమైతే తెలపాలని చెప్పారు.



పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సిఐ

ప్రజా
22 APR 2018



# చెరువులలో నీరు నింపడంపై ప్రత్యేక శ్రద్ధ

-మంచినీటి చెరువులను పరిశీలించిన మంత్రి మల్లాడి

యానాం/ప్రజాన్యూస్ : యానాం నియోజక వర్గ ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చూడటం కోసం పుదుచ్చేరి ఆరోగ్య శాఖామంత్రి మల్లాడి కృష్ణారావు ప్రత్యేక శ్రద్ధ



తరువాయి 6వ

## చెరువులలో నీరుల నింపడంపై ప్రత్యేక శ్రద్ధ

(మొదటి పేజీ తరువాయి)



చూపుతున్నారు. యానాంలోని మంచినీటి చెరువులను ఎప్పటికప్పుడు పరిశీలించి అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా ఇప్పటికే తగు చర్యలు చేపట్టి చెరువులలో నీరును నింపిస్తున్నారు. యానాం కనకాలపేట, దరియాలతిప్ప, గోపాల్‌నగర్, నల్ల చెరువలను పలుమార్లు పరిశీలించారు. చెరువుల్లో నీరు తోడేందుకు ఏర్పాటుచేసిన ఇంజన్లు పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేస్తున్నారు. ఆయనతో పాటు పరిపాలనాధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ప్రజాపనుల శాఖ ఇఇ రామదాసు తదితరులు పిల్లంక కాలువను పరిశీలించారు. అదేవిధంగా తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రాతో మంత్రి మల్లాడి భేటి అయ్యారు. ఈ సందర్భంగా యానాంలో మంచి నీటి పరిస్థితి గురించి చర్చించారు.

# మున్సిపల్ ఆదాయం పెరగాలి

## మంత్రి మల్లాడి కృష్ణారావు



యానాం, ఏప్రిల్21(వెలుగు విలేకరి): పుదుచ్చేరి ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందుల్లో కూరుకుపోవటానికి కేంద్రం నుండి రావాల్సిన 90 శాతం నిధులను 25 శాతానికి తగ్గించటంతో తీవ్ర పరిణామాలను ఎదుర్కొంటున్నామని, మున్సిపాల్టీలకు రాష్ట్రం నుండి నిధులను అందించే అవకాశం లేకపోవటంతో మున్సిపల్ పరిధిలోనే ఆదాయం పెంచుకునే మార్గాలను అన్వేషించాలని, వాటి ద్వారా బలోపేతం చేసుకోవాలని మంత్రి సూచించారు. క్యాంపు కార్యాలయం వద్ద పాత, కొత్త బస్టాండ్ పరిధిలోని షాపులు, మార్కెట్, సావిత్రినగర్‌లో ఉన్న షాపులు, మార్కెట్, సావిత్రినగర్‌లో ఉన్న షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. 20 సంవత్సరాలుగా షాపుల అద్దెలు పెంచకపోవటం సంస్థలోపమని, ఒకేసారి అద్దెలు రూ.నవేలకు పెంచి పబ్లిక్ ఆక్షన్ వేయటం వల్ల మున్సిపాల్టీకి ఆదాయం వస్తున్నప్పటికీ షాపుయజమానులకు ఆర్థికభారం అవుతుందని, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లుగా కాకుండా షాపుల అద్దెలను రెట్టింపు చేసి ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి పదిశాతం పెంచేలా సమావేశంలో తీర్మానించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కమిషనర్ గౌరీసరోజకు సూచించారు.

# త్రాగునీటికి కటకట





యానాం, ఏప్రిల్ 21(వెలుగు విలేకరి): గోదావరిలో నీటి మట్టం ధవళేశ్వరం వద్ద గణనీయంగా పడిపోవటం, పంట పొలాలకు ఈ సీజన్‌లో పదిహేను రోజులు అదనంగా నీరు అందించటం వల్ల త్రాగునీటికి తీవ్ర ఇబ్బందులు రానున్నాయని ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల విభాగం అధికారులు సూచించటంతో యానాంకూ నీటికి కటకటలు తప్పటం లేదు. గత వారంరోజులుగా మంత్రి మల్లాడి కృష్ణారావు పిల్లంక కాలువ, దరియాలతిప్ప కాలువల వద్ద పరిస్థితిని ప్రజాపనులశాఖ అధికార్లతో కలిసి పరిశీలించి ప్రస్తుత నీటి నిలువ ఎన్ని రోజులకు సరిపోతుందనే అంశాలను పరిశీలించారు. పిల్లంక కాలువ వద్ద ఇంజన్ల ద్వారా నీటిని తోడేందుకు జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకుని అందుకు తగిన ఏర్పాట్లను చేయించారు. యానాం ప్రజలకు ఎట్టిపరిస్థితుల్లోనూ నీటిఎద్దడి రాకుండా చేయాలని రాత్రి సమయాల్లోను చెరువులపై తిరుగుతూ అధికార్లకు తగు సూచనలు, అవసరమైన మోటార్లు ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. కాలువల్లో మరో రెండు రోజులు మాత్రమే నీటి నిలువ ఉంటుందని ఈలోగా చెరువులు నింపాలని తెలిపారు.

22 APR 2018

# ప్రశాంతంగా 6వ తరగతి నవోదయ పరీక్ష

యానాం : స్థానిక జవహర్ నవోదయ విద్యాలయాలలో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష రెండు కేంద్రాలలో ప్రశాంతంగా జరిగాయి. శనివారం ఉదయం స్థానిక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం ఉన్న తపాఠశాల, మహాత్మాగాంధీ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ ఎ. అనురాధ అధ్యక్షతన 6వ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహించగా సుమారు 500 మందికిగాను 447 మంది విద్యార్థులు హాజరై పరీక్షలురాసారు. నవోదయ విద్యాలయ ఛైర్మన్ పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావు పరీక్షా నిర్వహణ తీరును పరిశీలించారు. అలాగే విద్యాశాఖ అధికా కాలేశాయినద్ తదితరులు పరిశీలించారు. ఫలితాలను వారం రోజులలో విడుదల చేయనున్నట్లు నవోదయ అధికారులు తెలిపారు.

# 23న రహదారి భద్రతా వారోత్సవాలు

యానాం : రవాణా భద్రతా వారోత్సవాలను ఈ నెల 23 నుండి నిర్వహిస్తున్నట్లు రవాణా శాఖ ఎ. రవిచంద్రన్ ఓ ప్రకటనలో తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలో అవగాహన కల్పించేందుకు రవాణా భద్రతా వారోత్సవాలను నియోజకవర్గ అన్ని గ్రామాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు అతివేగంవలన, నిర్లక్ష్యంవలన జరుగుతున్నాయని ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఈ సదస్సును నిర్వహించనున్నామన్నారు. ఈ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.